
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 ఫిబ్రవరి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'మేకపాటి'కి కాకాణి పరామర్శ

ప్రజాశక్తి -నెల్లూరుప్రతినిధి

ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. శనివారం చెన్నయ్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు.అక్కడే ఉన్న అపోలో ఆసుపత్రి ఛైర్మన్ సిఆర్ ప్రతాప్‌రెడ్డిని కలిశారు. కొద్దిసేపు మాట్లాడుకున్నారు.



మేకపాటిని పరామర్శిస్తున్న మంత్రికాకాణి గోవర్ధన్‌రెడ్డి

'అన్న'ఉంటారా సార్..!

వైసిపి నేతలు, కార్యకర్తలో సందేహం - విజయం ఎక్కడుంటే 'ఆదాల' అక్కడే..

ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయం ఎక్కడుంటే ఆయన అక్కడుంటారు.. ఆయన వెళితే విజయం వస్తుందా ? విజయం వచ్చే చోటుకు ఆయన వెళతారా ? అనేది ఇప్పటికీ ఎవరికీ అంతుపట్టదు. తొలి నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాజకీయం అలాగే సాగింది. తొలుత టిడిపి, అటు తరువాత కాంగ్రెస్ అక్కడ నుంచి ప్రస్తుతం వైసిపి రేపు ఎక్కడో అనే అనుమానం అందరిలోనూ కలుగుతోంది. ఎన్నికల సమయంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. ఎక్కడ నుంచి పోటీ చేయాలనే విషయంపై అసమగ్ర అంచనా ఉంటుంది. ఆయన అడిగితే రాజకీయ పార్టీలు సై అంటున్నాయి. ప్రస్తుతం నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి 2024 ఎన్నికల్లో అభ్యర్థిగా ఆయనేనని ఆపార్టీ ప్రకటించింది. ఇప్పుడు ఆయన అక్కడే ఉంటారా? ఎన్నికల సమయంలో పార్టీ మారుతారా? అసలు ఏం జరుగుతుందనే చర్చ అంతా సాగుతోంది...

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రముఖ కాంట్రాక్టర్, వ్యాపారవేత్త, రాజకీయనేత ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆయన రాజకీయ ప్రస్తానం అంతా ఆసక్తిగా సాగింది. 1998 ఆదాల ప్రభాకర్‌రెడ్డి అల్లూరు కేంద్రంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి, అనేక కార్యక్రమాలు చేపట్టారు. బీద సోదరులు మస్తాన్‌రావు, రవిచంద్ర సన్నిహితులుగా ముందుకు సాగారు. రాజకీయ ప్రవేశం లక్ష్యంగా ట్రస్ట్ ద్వారా ఆయన ముందుగా అల్లూరులో అడుగు పెట్టారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ ప్రస్తానం మొదలైంది. 1999 అల్లూరు నుంచి టిడిపి అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. చంద్రబాబునాయుడు ఆయనను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిపై ఆయన విజయం సాధించారు. ఆదాలకు 50,829 ఓట్లురాగ, విష్ణువర్ధన్‌రెడ్డి కి 45,946 కోట్లు వచ్చాయి. 4883 ఓట్లతో ఆదాల గెలు పొందారు. తొలిసారిగా శాసన సభకు ఎన్నికైన ఆదాలకు చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రిగా బాధ్యతలిచ్చారు. ఆ సమయంలో టిడిపి అభివృద్ధిలోనూ, జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణంలోను ఆదాల ప్రముఖంగా వ్యవహరించారు. 2004 ఎన్నికల సమయానికి ఆదాల కాంగ్రెస్‌పార్టీలోకి జంప్ అయ్యారు. ఆరోజు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హవా గ్రహించడం, 2004లో అల్లూరు వదిలి సర్వేపల్లి నియోజకవర్గానికి వెళ్లారు. 2004 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పై ఆదాల ప్రభాకర్‌రెడ్డి 7,625 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో మళ్లీ సర్వేపల్లి నుంచి చంద్రమోహన్‌రెడ్డిపై పోటీ చేశారు. 10 వేల ఓట్ల మెజారిటీతో మళ్లీ ఆదాల విజయం సాధించారు. 2014లో టిడిపి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డికి గట్టిపోటీ ఇచ్చారు. కేవలం 13 వేల ఓట్లతోనే ఓడిపోయారు. అప్పటి నుంచి నెల్లూరు రూరల్ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా కొనసాగారు. 2019 ఎన్నికల్లో మళ్లీ ఆయనున్న టిడిపి రూరల్ అభ్యర్థిగా ప్రకటించింది. ఆ ఎన్నికల్లో ప్రచారం చేస్తూ వెళ్లి వైసిపిలో చేరారు. ప్రస్తుతం నెల్లూరు ఎంపిగా వైసిపి తరపున ఉన్నారు. ఆరోజు వైసిపి గెలుస్తుందనే అంచనాతో ఆయన పార్టీ మారారు. గత చరిత్ర అంతా ఎక్కడ విజయం ఉంటే అక్కడ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీకి దిగుతారని ప్రచారం ఉంది.



ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపి

'అన్న' ఉంటారా సార్..!

ఆదాల ప్రభాకర్‌రెడ్డి 2024 వైసిపి నెల్లూరు రూరల్ అభ్యర్థిగా ఉంటారని వైసిపి అధిష్టానం ప్రకటించింది. దీనిని వైసిపితోపాటు, టిడిపి, ఏ ఇతర పార్టీ నేతలు నమ్మడం లేదు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సైతం ఇదే అంశం ఇటీవల లేవనెత్తారు. ప్రస్తుతం 2024లో వైసిపి ఓడిపోతుందని, టిడిపి విజయం సాధిస్తుందనే ప్రచారం సాగుతోంది. అప్పటి ఆదాల ప్రభాకర్‌రెడ్డి టిడిపి వైపు వెళ్తారని కొందరు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత చరిత్రలో భాగంగానే కొందరు ఇలాంటి వాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల ఆదాల మాట్లాడుతూ తానే నెల్లూరు రూరల్ వైసిపి అభ్యర్థిగా పోటీచేస్తానని చెప్పి, ఐదేళ్లకోసారి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఆయన ఎక్కడున్నా ఆక్కడ నేతలను సర్దుబాటు చేసుకోవడం, అభిమానులను తయారు చేసుకోవడం ఆదాల ప్రత్యేకత. అటు వైసిపిలోనూ, ఇటు టిడిపిలోనూ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాజకీయ వ్యూహం అర్థంకావడం లేదు. అనుమానం మాత్రం అందరిలోనూ ఉంది. వైసిపి నేతలు సైతం ఆయనను గట్టిగా నమ్మడం లేదు. " అన్న ఉంటారా సార్" అంటూ కనిపించిన అందరినీ విచారిస్తున్నారు. ఏ క్షణం ఏమి జరుగుతుందో తెలీదు. మరో ఏడాది సమయం ఉండడంతో ఏవరు ఏ పార్టీలో ఉంటారో అర్థం కాని పరిస్థితి ఉంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి అంశం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ మారింది. ఏం జరుగుతుందో చూడాలి.



కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -నెల్లూరు

నెల్లూరు కలెక్టరేట్‌లో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలోని వెనుక బాగంలోని రేకుల షెడ్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. తొలుత ఒక ఫైర్ వాహనం వచ్చి పంటలు ఆపే ప్రయత్నం చేసింది. ఎంతసేపటికి అదుపులోకి రాకపోవడంతో మరో వాహనం వచ్చింది. అతి కష్టంపైన మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.కలెక్టరేట్‌లో పాత ఫర్నిచర్, చెడిపోయిన కంప్యూటర్లు, పనికిరాని వస్తువులు ఇక్కడ ఉన్నట్లు తెలిసింది. ప్రమాదంతో ఒక్కసారిగా కలెక్టరేట్‌లో ఆందోళన నెలకొంది. తొలుత ముఖ్యమైన ఫైళ్లు తగలపడ్డాయని అందరూ భావించారు. అందులో ఉపయోగంలేని వస్తువులు తగలబడడంతో ఊపిరిపీల్చు కున్నారు. అనంతరం కలెక్టర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి నష్టమూ జరగలేదని, కేవలం ఉపయోగం లేని కొన్ని వస్తువులు మాత్రమే అక్కడ ఉన్నాయని తెలిపారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఆరా తీస్తున్నారు.

డిఇఒగా గంగాభవాని నియామకం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా విద్యాశాఖాధికారిగా గంగాభవాని ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శనివారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వ్యాలు విడుదల చేశారు. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడి కోడ్ అమలులోకి రానున్న నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



గంగా భవాని

కెజిబివి ఉపాధ్యాయులకు

మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పి బాబురెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

కొత్త పిఆర్‌సిని అనుసరించి కెజిబివి ఉపాధ్యాయులకు ప్రభుత్వం మినిమం టైం స్కేల్ అందజేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆయన పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మంత్రివర్గం కెజిబివి ఉపాధ్యాయులకు 23 శాతం జీతాలు పెంచుతున్నట్లు నిర్ణయిం చినట్లు అధికారులు ప్రకటించారని, వాస్తవానికి కెజిబివి ఉపాధ్యాయులకు 2016 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం జీతాలు పెంచలే దన్నారు. మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ గత ఆరేళ్లుగా అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచామని చెప్పడం సరైనది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన పిఆర్‌సి ప్రకారం టైమ్స్ స్కేల్‌ను అనుసరించి రూ. 54,060లు వేతనంగా అందజేయాల్సి ఉంటే రూ. 34,139 లు అందజేస్తున్నట్లు పేర్కొం దన్నారు. దీని ప్రకారం ఒకొక్క ఉపాధ్యాయుడు నెలకు రూ.19921లు నష్టపోతు న్నారన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు మినిమం టైమ్ స్కేల్‌గా రూ.44,570లు చెల్లించాల్సి ఉండగా, పెరిగిన 23 శాతం కలిపి రూ. 26,759లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ నెలకు 17811 రూ. ప్రతినెల నష్టపోతున్నారన్నారు. కెజిబివి బాలికల పాఠశాలలు బాగా నడుస్తున్నాయని, అభివద్ధి చేస్తామని ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించినప్పటికీ విద్యార్థులకు సబ్జెక్టు బోధించేందుకు నియమించిన కాంట్రాక్టు పిజిటిలకు మినిమం టైం స్కేల్ గా రూ. 48,440 లు వేతనంగా అందజేయాల్సిన ప్రభుత్వం వేతనంగా రూ. 12,000 లు మాత్రమే చెల్లిస్తుందన్నారు. కెజిబివిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాలికల పాఠశాల అయినందున తగిన రక్షణ కోసం వార్డెన్ ని ప్రత్యేకంగా నియమించాల్సిన అవసరము ఒదన్నారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ లేదా ఉపాధ్యాయులు రాత్రులు పిల్లలతో సహా అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వార్డెన్ నియామకం చేపట్టి ఉపాధ్యాయులకు ఆభారాన్ని తొలగించాలన్నారు.కెజిబివి ఉపాధ్యాయులకు కేవలం క్యాజువల్ సెలవులు మాత్రమే ఉన్నాయి. ఇతర ఉపాధ్యాయులకు వల్లే స్పెషల్ క్యాజువల్ సెలవులు ,మహిళా ఉద్యోగులకు ఉన్న ప్రత్యేక సెలవులు ఇవ్వాలన్నారు. మెటర్నటీ లీవు,చైల్డ్ కేర్ లీవు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆర్థికంగా ఇబ్బం దుల్లో ఉన్నప్పటికీ జీతాలు పెంచబోమని ప్రకటించడం సరికాదన్నారు.



పి బాబురెడ్డి



'విఎస్‌యు'లో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అంతర్ జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ముఖ్య అతిథిగా వచ్చి విన్నర్స్ కు ట్రోఫీ అందజేశారు. ఈ పోటీలలో జిల్లాలో కావలి, ఆత్మకూరు, గూడూరు, నెల్లూరు 4 జోన్ల నుండి 35 కళాశాల జట్లు పాల్గొన్నాయి. వీరిలో విన్నర్స్ , రన్నర్స్‌గా నిలచిన జట్ల కు గత రెండు రోజులుగా పోటీలు నిర్వహించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కలశాల, నెల్లూరు జట్టు విన్నర్‌గా నిలిచాయి. శ్రీ కష్ణ చైతన్య కలశాల,నెల్లూరు రన్నర్స్ గా నిలిచాయి. .ఉపకులపతి క్రీడా కారులుల ఉద్దేశించి మాట్లాడారు. టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీని, పథకాలను భాహుకరించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి రామచంద్ర రెడ్డి, కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య విజయ ఆనంద కుమార్ బాబు , స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ డాక్టర్ కె. సునీత పాల్గన్నారు. వి ఎస్ యూ పి డి లు ప్రవీన్ కుమార్, మణికంఠ, రవీంద్రమ్మ క్రీడాకారులను అభినందించారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

:మండలంలోని పోలినేనిపాలెం ఎస్‌సి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ కాలనీకి చెందిన పదో వార్డు స్వతంత్ర సభ్యులు ఎండ్లూరి ఆంజనే యులు ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఆయన తరపున వీరాంజనేయులు ఈ కార్యక్రమం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చదువుతో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఇంకా ఉపాధ్యాయుని పి పావని, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభం


ప్రజాశక్తి-నెల్లూరు : క్రీడలు జీవితాంతం ఆరోగ్యాన్నిస్తాయని ఎంపి, రూరల్ నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సౌత్ మోపూరులో శనివారం రూరల్ నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడాపోటీలను జడ్‌పి ఛైర్మన్ ఆనం అరుణమ్మతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులనుద్ధేశించి ఆయన మాట్లా డుతూ విద్యతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో పాల్గొన్నవారు ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు. అందుకు తానే ఉదాహరణ అన్నారు. తన విద్యార్థిగా ఉన్న రోజుల్లో క్రీడల్లో ఆసక్తి చూపే వాడినని, జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా పాల్గొన్నాని తెలిపారు. వారంలో కనీసం 4 రోజులు వ్యాయామం అవసరమని, విద్యార్థులు దానిని పాటించాలన్నారు. జడ్‌పి ఛైర్మన్ ఆనం అరుణమ్మ, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. డిసిసిబి మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, విజయ డైరీ ఛైర్మన్ రంగారెడ్డి, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, స్థానిక నేత పముజల దశరథ రామయ్య, రూరల్ ఎంపిపి విజయ్ కుమార్, వైస్ ఎంపిపి రవీందర్ రెడ్డి, కార్పొరేటర్లు అవినాష్, నూనె మల్లికార్జున యాదవ్, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కోటేశ్వర్ రెడ్డి ఉన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

పార్టీ మారే ప్రసక్తే లేదు..!

- టిడిపి వైపు వెళ్లేది లేదు..
- కందుకూరు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తా..
- శ్రేణులకు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి స్పష్టం



మహీధర్‌రెడ్డి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఎన్నికల సమరాగానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన ముందుగా తన రాజకీయ భవితవ్యంపై వస్తున్న పుకార్లు, సాగుతున్న ప్రచారాలకు స్వస్తి చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. దాదాపు ఏడాది కాలంగా మహీధర్ రెడ్డి రాజకీయ భవితవ్యం పై నియోజకవర్గంలో అనేక ప్రచారాలు సాగాయి. వచ్చే ఎన్నికల్లో ఆయన పొరుగునే ఉన్న కావలి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనేది ఒక పుకారు..టిడిపిలోకి మహీధర్ రెడ్డి రాజకీయ వలస వెళతాడనేది మరో ప్రచారం. వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేయడానికి మహీధర్ రెడ్డి ప్రయత్నాలు ప్రారంభించారని ప్రచారం హోరెత్తింది.ఈ పుకార్లు, ప్రచారాలన్నీ టిడిపి నుంచే వచ్చాయి. కొందరు టిడిపి నేతలైతే మహీధర్ రెడ్డి ఆ మధ్య నారా చంద్రబాబు నాయుడుని, లోకేష్‌ను కలిశారని ప్రచారం చేశారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో తనను నిర్వరియంచేయడానికి, వైసిపి శ్రేణులను గందరగోళంలో ముంచెత్తడానికి ప్రత్యర్థులు ఇలాంటి పుకార్లు ప్రచారాలు సాగిస్తున్నారని మహీధర్ రెడ్డి భావించారు. ఈ పుకార్లు, ప్రచారాలను తిప్పి కొట్టడానికి మహీధర్ రెడ్డి తన భవిష్యత్ రాజ కీయంపై స్పష్టత ఇచ్చారు. ఇటీవల మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామ, సచివాలయాల పార్టీ కన్వీనర్ల సమావేశంలో ఆయన స్పష్టత ఇచ్చారు.తానేప్పుడు టిడిపి వైపు ఎల్లబోనని మహీధర్ రెడ్డి స్పష్టం చేశారు. 1985లో రాష్ట్రమంతటా టిడిపి గాలి వీచిన సమయంలో తన తండ్రి మానుగుంట ఆదినారాయణ రెడ్డి ఆ పార్టీకి వ్యతిరేకంగా నిలబడి కందుకూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించారని మహీధర్ రెడ్డి గుర్తు చేశారు. తాను కావలికో, కనిగిరి నియోజక వర్గానికో వెళ్తానని వస్తున్న ప్రచారం లోనూ నిజం లేదన్నారు. టీ దుకాణాల వద్ద సాగుతున్న ఈ పుకార్లు ప్రచారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అయితే మహీధర్‌రెడ్డి వైసిపిలోనే ఉంటానని స్పష్టం చేసినప్పటికీ టిడిపిలోని ఒక వర్గం నాయకులు తమ ప్రచారాలను ఆపడం లేదు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరా వును వ్యతిరేకిస్తున్న ఆ పార్టీకి చెందిన మరో నేత అనుచరులు టిడిపి అభ్యర్థిత్వం మహీధర్‌రెడ్డికే లభిస్తుందని ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇంటూరి నాగేశ్వరరావుకు టిడిపి అభ్యర్థత్వం లభించదని చెప్పడానికే వారు ఇలాంటి ప్రచారాలు లంకిం చుకున్నారని చెబుతున్నారు. ఇదే వర్గీయులు ఆ మధ్య వరకు టిడిపి అభ్యర్థత్వం మాజీ శాసనసభ్యులు పోతుల రామారావుకు దక్కుతుందంటూ ప్రచారం సాగించడం కొసమెరుపు.



మాట్లాడుతున్న కమిషనర్ హరిత

భూహక్కు రీ సర్వే పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం నిర్వహణలో భాగంగా నగర వ్యాప్తంగా రీ సర్వే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం నిర్వహణపై కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం, వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రటరీలతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రటరీలు సమన్వయంగా విధులు నిర్వహించి రీ సర్వే పనులను పూర్తి చేయాలని సూచించారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని అసెస్మెంట్ నెంబర్లను అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి తమ లాగిన్ ల ద్వారా సిడిఎంఎ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన సమాచారం అందించడంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు అడ్మిన్ కార్యదర్శులకు సహకరించాలని కమిషనర్ సూచించారు. నిర్దేశించిన గడువులోగా రీ సర్వే పనులను పూర్తి చేసి సమగ్ర సమాచారాన్ని ఆన్లైన్ లో పొందుపరచాలని సెక్రటరీలను కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తి చేసిన గహాలను ఉగాది నాటికి లబ్ధిదారులకు అందజేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత ఆదేశించారు. శనివారం "హౌసింగ్ డే" ను పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వరపురం భగత్ సింగ్ కాలనీ ప్రాంతంలోని జగనన్న కాలనీ నిర్మాణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గహాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు లే అవుట్ల నిర్మాణ పనుల్లో లక్ష్యాలను నిర్దేశించి అభివద్ధి పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్తు, వీధి దీపాలు, మంచినీరు, డ్రైన్లు, రోడ్డు మార్గాలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉగాది నాటికి లబ్ధిదారులకు గహాలను కేటాయించాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు షేక్ జమీర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం


ప్రజాశక్తి-లీగల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లోక్ అదాలత్ ఛైర్మన్ సి.యామిని ఆదేశాల మేరకు లోక్ అదాలత్ సెక్రటరీ శ్రీనివాసరావు నాయక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 14,024 కేసులు పరిష్కార మయ్యాయి. తద్వారా ఆరు కోట్ల 43 లక్షల 13,842 బాధితులకు చెల్లించుటకు అంగీకారం తెలిపారు. జిల్లాలోని నగరంలో ఐదువేల 105 కేసులు, గూడూరు 1505, కోవూరు 744, కావలి 1261, వెంకటగిరి 1159, కోట 1056, నాయుడుపేట 1251, సూళ్లూరుపేట 1113, ఆత్మకూరు 435, ఉదయగిరి 395, కేసులను పరిష్క రించారు. వివిధ కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు, బ్యాంకు కార్పొరేషన్, అధికారులు మోటార్ వెహికల్ డిపార్ట్మెంట్, ఆర్‌టిసి అధికారులు, కక్ష దారులు పాల్గొన్నారు.



నెల్లూరులో నిర్వహించిన లోక్‌అదాలత్‌తో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి యామిని

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు కోర్టు ఆవరణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1964 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయి. అందులో 28 సివిల్ కేసులు, నాలుగు వివాహ సంబంధం కేసులు, 175 క్రిమినల్ కేసులు, 6 చెక్ బౌన్ కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి.. ప్రెసిడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎన్ విజయబాబు,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి పూర్ణిమదేవి వ్యవహరించారు. లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాదులు బివి శేషయ్య, బి వెంకటేశ్వర్లు, ఎస్కే షంషుద్దీన్, ఎస్ పవన్ కుమార్ వ్యవహరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలేటి శ్రీధర్ నాయుడు, కెవి నరసింహారావు, ఎస్.కె మస్తాన్ వలి, సిహెచ్ హరికష్ణ, కెవిఎల్ నరసింహారావు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

'ఓవెల్' పాఠశాలలో వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని 11వ డివిజన్ సరస్వతి నగర్ ప్రాంతంలో ఉన్న ఓవెల్ మోడ్రన్ పాఠశాలలో శనివారం ట్విలైట్ పియస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి నిత్యం ఉద్యోగ నిర్వహణలో తలమునకలౌతూ యాంత్రిక జీవనయానం సాగిస్తున్న తల్లిదండ్రులకు ఆటవిడుపుగా ఉండటానికి వింటర్ పెస్ట్ నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు, పురుషులకు వేరు వేరుగా క్రీడా పోటీలు నిర్వహించారు. పురుషులు వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, షార్ట్ పుట్, కబడ్డీ మహిళలకు రంగోలి,త్రోబార్,మెహందీ, మ్యూజికల్ చైర్స్,లెమన్ అండ్ స్పూన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓవెల్ మోడ్రన్ పాఠశాల సిఇఓ ప్రమీల హాజరై పోటీలను ప్రారంభించారు. మహిళలు వేసిన వివిధ రంగు రంగుల ముగ్గులు తిలకించి వారిని అభినందించారు.పై కార్యక్రమములో విద్యార్థుల తల్లిదండ్రులందరూ చాలా ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభను కనపరిచిన తల్లిదండ్రులకు ప్రథమ, ద్వితియ, తతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, రమాదేవి, ఎజీయం సునీల్, పి.ఈ.టి వెంకటేష్ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ మన రాష్టానికి...

ప్రజాశక్తి -రాపూరు : మండలంలోని అకిలి వలసలోని 54వ బూతులో వెంకటగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ ఆదేశాల మేరకు గ్రామ పార్టీ అధ్యక్షులు కొండ్లపూడి శివారెడ్డి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. మండల మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్, ధార శీను గారు , మచ్చల నర్సింలు పాల్గొన్నారు.



గిరిజనులు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-అల్లూరు



నిరక్షరాస్యతతో అత్యధిక శాతం ఉన్న గిరిజనులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వైసిపి ఎస్‌టిసెల్ మండల అధ్యక్షులు దాసరి పోలయ్య పేర్కొన్నారు. అల్లూరు మండలంలోని సింగపేట పంచాయతీ పరిధి మూర్తిరాజు సంఘం గిరిజన కాలనీ సందర్శించి పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు 5 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. అలా చేసుకోకపోతే తాను దగ్గరుండి ఈ సేవలు అందిస్తానని అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తెలియజేశారు. వికలాంగులు ఆయా కార్యాలయాలకు రాని పక్షంలో మెడికల్ వాహనం ద్వారా ఇంటి వద్దకే వచ్చి విస్తృత సేవలు అందిస్తామన్నారు. ఈ గ్రామం నుండి సుమారు 30 మంది విద్యార్థులు 1 కిలోమీటర్ నడిచి ఆర్‌టిసిలో అల్లూరుకు చేరుకొని చదువుకొని తిరిగి వస్తున్నారని గిరిజనులు ఆయనకు వివరించారు. సంబంధిత విషయాన్ని వెంటనే ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువెళ్లి బస్ గ్రామంలోకి వచ్చే విధంగా చూస్తానని హామీనిచ్చారు. ప్రతి ఒక్కరినీ చదివించాలని అలాగే పిల్లలను ఇటుక బట్టీలు వద్ద ఉంచరాదని, అలాంటివారు ఎవరైనా ఉంటే సమాచారం ఇస్తే హాస్టల్లో ఉంచి చదివిస్తానని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రతి ఒక్కరూ ఈ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరంజ్యోతి, రేవతి, పొట్టూరు చెంచయ్య, తదితరులు ఉన్నారు.

జాతీయ యునాని డే వేడుకలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జాతీయ 7వ యునాని డే వేడుకలను ఆత్మకూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యులు డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రజాక్ యునాని వైద్య పితామహులు హకీం అజ్మల్‌ఖాన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ యునాని డేను నిర్వహిస్తూ ఉంటారని ఈ సందర్భంగా వారి జయంతిని పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యులు డాక్టర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ అతి ప్రాచీనమైన యునాని వైద్య ప్రక్రియలో ఎంతో మంది ప్రజలు ఎన్నో రకాల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవడానికి యునాని వైద్యాలు ఎంతో దోహద పడిందని ప్రతిఒక్కరూ ఈ వైద్యాన్ని ఉపయోగించుకొని తమ వ్యాధులను నయం చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో ఉన్న ఈ వైద్యశాల ద్వారా ఎంతో మంది తమ రోగాలను దూరం చేసుకున్నారని ప్రజలు ఈ యునాని వైద్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది కృష్ణవేణి, చలపతిరావు, సిబ్బంది హాజరయ్యారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా..

ప్రజాశక్తి-మర్రిపాడు : నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై మరిపాడు వద్ద సిమెంట్ ట్యాంకర్ బోల్తా పడినది. కృష్ణపట్నం పోర్టు నుండి బళ్లారి వెళుతున్న ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు.

పెరటి కోళ్లు పంపిణీ



ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఏపిఎం బుజ్జమ్మ పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారిత కార్యక్రమంలో భాగంగా మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరచుకునేందుకు, ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు ప్రభుత్వం పెరటి కోళ్ల కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండలానికి 100 యూనిట్లు రాగా 100మంది లబ్ధిదారులకు 10కోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా హెచ్‌డి యాంకర్ పర్సన్ సుబ్బరాజు, సిసిలు, అకౌంటెంట్ జరింతాజ్ విఒఎలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని కాకొల్లువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు మాధవరపు నాగేంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ చైర్స్, స్టడీ ప్యాట్స్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాలభాస్కర్ మాట్లాడుతూ ముందుగా మాధవరపు నాగేంద్ర మెమోరియల్ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది విద్యా కమిటీ చైర్మన్ కె.శ్రీనివాసులు, గ్రామస్తులు వెంకటరత్నం, ఎస్.మాలకొండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డాక్టర్ ఆదిశేషయ్యకు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ఇటీవల డాక్టర్ చిల్లూరు ఆది శేషయ్య తన అమె రికా పర్యటన దిగ్వి జయంగా పూర్తి చేసు కుని స్వదేశానికి విచ్చే సిన సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ సచివాలయాల కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా శనివారం డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్యను శాలువాలతో పూల మాలతో 20వ వార్డు వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మానం చేసిన వారిలో 20వ వార్డు వైసిపి నాయకులు విశ్రాంతి ఉపాధ్యాయులు నందవరపు ప్రసాద్, ప్రతాప్, గాబ్రియేల్, జీవన్, చిన్నబ్బయ్య, తదితరులున్నారు.

నేడు బిఎస్ఆర్ విగ్రహ స్థాపనకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జనహృదయ నేత, మాజీ శాసనసభ్యులు, ప్రజా వైద్యులు డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి కాంస్య విగ్రహం స్థాపనకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన అభిమానులు తెలియజేశారు. స్థానిక బిఎస్ఆర్ సెంటర్‌లో ఆదివారం 10 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టణ పురప్రముఖులు గ్రామపెద్దలు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని బి.ఎస్.ఆర్. అభిమానులు పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-కోవూరు



నెల్లూరు చిత్తూరు జట్లు మధ్య జరిగిన మ్యాచ్లో నెల్లూరు జట్టు52 సాధించగా చిత్తూరు జట్టు 25పాయింట్లు సాధించింది. నెల్లూరు జట్టు చిత్తూరు జట్టు పై 25 విజయం సాధించింది. ప్రకాశం వెస్ట్ గోదావరి మధ్య జరిగిన మ్యాచ్ లో ప్రకాశం జట్టు46 పాయింట్లు సాధించింది. వెస్ట్ గోదావరి జట్టు 11 పాయింట్ సాధించగా ప్రకాశం జట్టు వెస్ట్ గోదావరి పై 35 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందిందని అసోసియేషన్ బోర్డ్ కన్వీనర్ కె.బాలు తెలియజేశారు.ముఖ్య అతిథులు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. వీర్లాలంకయ్య, సిఐ రామకష్ణారెడ్డి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్వైస్ ప్రెసిడెంట్ ఎం.రంగారావు, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆఫీస్ బేరర్ ఏవీ కష్ణారావు, ఎం. రామచంద్ర, నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లవ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దారా విజయబాబు, జాన్సన్, విజనందం, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు పరామర్శ

ప్రజాశక్తి-కోవూరు

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై. చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్టు కొమారి జనార్దన్ ఉన్న నివాసంలో శనివారం వైసిపి సీనియర్ నాయకులు చేవూరు రాంప్రసాద్‌ను కలిశారు. మరి కొందరు విలేకరిని పరామర్శిం చారు. ఆయనవెంట బెంగుళూరుకు చెందిన నాయుడు, నీలిశెట్టి ప్రసాద్, వావిలి సోమయ్య, ఆవులు, సుదీర్, అంగన్‌వాడీలు తదితరులున్నారు.

28న జెవివి సైన్స్ దినోత్సవ పోటీలు

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న జె.వి.వి.నాయకులు

కావలి పట్టణ జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 28వ తేదీన సైన్స్ దినోత్సవం ఘనంగా జరపాలని నిర్ణయించినట్లు జెవివి పట్టణ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక "జర్నలిస్ట్‌క్లబ్" లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు జె.వి.వి. ఉపాధ్యక్షులు పి.జానకిరామ్, షేక్.ఖాదర్‌బాషా, కార్యవర్గ సభ్యులు చాకలకొండ శారద, హనిశారద రెడ్డి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జెవివి హైస్కూల్ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించేందు కోసం 13వ తేదీ నుండి 21వ తేదీ వరకు సైన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో 6,7 తరగతుల నుండి ముగ్గురు విద్యార్థులను జూనియర్లుగా 8, 9, 10 తరగతుల నుండి ముగ్గురు విద్యార్థులను సీనియర్లుగా పరిగణించి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో 13న వ్యాసరచన పోటీలు జూనియర్లకు "ప్రత్యక్షీకరణ–మన సంరక్షణ", సీనియర్లకు "నిత్య జీవితంలో విజ్ఞాన శాస్త్రం"అనే అంశాలపై జరుగుతున్నాయని, 14వ తేదీన వక్తృత్వ పోటీలు జూనియర్లకు "శాస్త్రీయ దృక్పథం–మానవ ప్రగతికి సోపానం", సీనియర్లకు "వైజ్ఞానిక పరిశోధనలో మానవుడు ఇంతవరకు సాధించిన మైలు రాళ్లు–సాధించిన విజయాలు" అనే అంశాల పై జరుగుతాయన్నారు. 15వ తేదీన చిత్రలేఖనం జూనియర్లకు మతం కన్నా మానవత్వం మిన్న", సీనియర్లకు "కాలుష్య కారకాల నిర్మూలన–ఆరోగ్యకర జీవనానికి మూలం"అనే అంశంపై నిర్వహిస్తామన్నారు. నృత్యపోటీలు "శాస్త్రీయ–జానపద నృత్య పోటీలు (ఐండివిడ్యువల్) జరుగుతాయన్నారు. 17న సందేశాత్మక పాటలు నిర్వహిస్తామని తెలిపారు. 21వ తేదీన "సైన్స్‌క్విజ్ (సైన్స్, జి.కె.,విజువల్) పోటీలు జరుగుతాయన్నారు. ఈ వారం రోజులపాటు పోటీలు ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణంలోని రెడ్‌క్రాస్ భవనంలో జరుగుతాయని, ప్రతిరోజూ ఉదయం 9.30గంటలకే పోటీలు ఖచ్చితంగా ప్రారంభమవుతాయన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు సమయం కేవలం ఒక్క గంట మాత్రమే వ్యవధి ఇస్తామని తెలిపారు. 28వ తేదీ సైన్స్ డే రోజున ఉదయం 9గంటల నుండి విద్యార్థులు తయారుచేసే, వైజ్ఞానిక ప్రదర్శన పోటీ ఉంటుందన్నారు. విద్యార్థులు తమస్వీయ ప్రదర్శనలను తయారు చేసుకుని, కమిటీ కేటాయించిన ప్రదర్శనా స్థలంలో ప్రదర్శన సిద్ధంగా ఉండాలని వారు తెలియజేశారు. ప్రదర్శనలు అనేక కొత్త సైన్స్ దినోత్సవ సభ జరుగుతుందని, ఈ సభలో విజేతలకు అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్



జెఆర్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

తూర్పు రాయలసీమ (చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) శాసనమండలి ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని ఆవాజ్ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి పి.యస్థానిబాషా ఓటర్లను కోరారు. ఈ మేరకు శనివారం ఆత్మకూరు పట్టణంలోని తూర్పు వీధిలో ఉన్న గాయత్రి స్కూల్, టెంకాయ తోపులో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఎన్నికలలో తమ అభ్యర్థులకు ఓట్లు వేసి విజయం చేకూర్చాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పోరాట పటిమ కలిగిన వెంకటేశ్వర్లు రెడ్డి, బాబురెడ్డిలను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి గళం వినిపించి రాజీలేని పోరాటాలు సాగిస్తారని వారు ఓటర్లకు వివరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న ఆయా వర్గాల సంక్షేమానికి సమస్యల పరిష్కారానికి న్యాయమైన కోర్కెల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 7వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎమ్‌డి సాలార్షుద్దీన్, 7వ వార్డు ఆవాజ్ కమిటీ సభ్యులు సర్దార్, షేక్ ఖాజా రహమతుల్లా, పి.అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు. **పట్టణంలోని జెఆర్‌పేట** ప్రాంతంలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు హరికృష్ణ, ఉపాధ్యాయులు పెంచలయ్య, వాగాల శ్రీహరి, మోహన్ రెడ్డి తదితరులున్నారు.



మొక్కుబడి తీర్చుకున్న నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌కి చేసిన చికిత్స విజయవంతం కావడంతో వైసిపి నాయకులు మొక్కుబడులను తీర్చుకున్నారు. శనివారం చెన్నైలో అజ్మీర్ దర్గాలో ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్, జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ గడియాల్సి ఎన్నో పవిత్రమైన దండక్ నియాజ్ కల్లె మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడిని ఆశీస్సులతో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పూర్తిగా కోలుకొన్నారని ఆదివారం తిరిగి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి వస్తున్నారని జనులకు ప్రజాసేవలో ఉండడానికి ఆయన నిర్ణయించుకున్నారని తెలిపారు. రాబోయే రోజులలో ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుచడానికి కృషి చేస్తానని, తన ఆరోగ్యం కోసం నియోజకవర్గ ప్రజలు నాయకులు చేపట్టిన ప్రార్థనలు ప్రత్యేక పూజలు ప్రజలు దీవెనలు చికిత్స విజయవంతమైందన్నారు. నేటి నుండి వేసే ప్రతి అడుగు నియోజకవర్గం ప్రజల అభివృద్ధి కొరకేనని తెలియజేశారు. బండగానిపల్లి మాజీ సర్పంచ్ మూలే అక్కుల్‌రెడ్డి, నాయకులు దాదాభాయ్, గాజుల తాహెర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

భర్త ఇంటి ఎదుట నిరసన ధర్నా

ప్రజాశక్తి-కావలి

కావలి సుంకల వారి తోటలో పెళ్లయిన రెండు నెలలకే షానవాజ్ అనే మహిళను భర్త, అత్త వారి బంధువులు ఇంటి నుండి వెళ్లగొట్టడంతో సిపిఐ సహకారంతో భర్త ఇంటి ఎదురుగా శనివారం బాధితురాలు ధర్నా, ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా బాధితురాలు షానవాజ్ మాట్లాడుతూ తాను గుడ్లదొన గ్రామంలో ఉంటానని, తనకు తండ్రి చనిపోయాడని, తన బాధ్యతలన్నీ అమ్మే చేస్తుందని తెలిపింది. తనకు పెళ్లి సంబంధం చూసి కావలిలోని సుంకల వారి తోటలో "జాఫర్" అనే వ్యక్తికిచ్చి వివాహం చేశారని, పెళ్లయిన దగ్గరి నుంచి తన భర్త తనతో సంసారం చేయలేదని, తాను అడగగా తనకు సంసారంపై ఆసక్తి లేదని, ఇలా కొన్ని రోజుల తర్వాత తన భర్త సంసార జీవితానికి పనికిరాడని తెలిసిందని తెలిపింది. కొన్ని రోజుల తర్వాత తన అత్తకు విషయాన్ని తెలిపానని చెప్పింది. అనంతరం తన భర్త, అత్త తనను ఇష్టానుసారంగా కొట్టారని తెలిపింది. అనంతరం ఇంట్లోనుంచి తనను గెంటేశారని తెలిపింది. ఏం చేయాలో తెలియక స్థానిక సిపిఐ నాయకులను ఆశ్రయించగా వారు తమకు అండగా నిలిచిందని తెలియజేసింది. కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపింది. సిఐ విచారణ జరిపి న్యాయం చేస్తానని తనకు హామీనిచ్చినట్లు పేర్కొంది. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, షానవాజ్, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దర్గాబాబు, వాహనాల మధు, సర్దార్, సాబ్‌బాషా, జలీల్, కరిముల్లా, మహిళలు పాల్గొన్నారు.

తీవ్ర సంక్షోభంలో ఆక్వారంగం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట




మాట్లాడుతున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

వైసిపి పాలనలో ఆక్వా రైతులకు అన్యాయం జరిగిందని కోవూరు టిడిపి నియోజకవర్గ బాధ్యులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని జగదేవిపేట గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. మండల టిడిపి అధ్యక్షులు రావెళ్ల వీరేంద్రచౌదరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు దినేష్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి దీవించారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్వా రైతులు జోన్ విధాన లోపం కారణంగా కరెంట్ బిల్లులు అధికంగా రావడంతో గత్యంతరం లేని పరిస్థితులలో ఆక్వా రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎదురైందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తేవడంలో స్థానిక శాసనసభ్యులు విఫలమైనారని తెలిపారు. ఆక్వారంగంపై ఆధారపడిన అనేక మంది రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్వా రంగాన్ని కాపాడాలని సూచించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో టిడిపి ఆధ్వర్యంలో రైతు ఉద్యమంపై పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర చౌదరి, జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి చెంచు కిషోర్ బాబు, అధికార ప్రతినిధి చేముకుల కృష్ణ చైతన్య, టిడిపి మండల ఉపాధ్యక్షులు కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, సీనియర్ నాయకులు కొండూరు సుధాకర్ రెడ్డి, బొలినేని రవినాయుడు, బొల్లినేని హరి నాయుడు, మునగాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి-అల్లూరు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

జగన్మోహన్ రెడ్డి సర్కార్‌లో అర్హులకు పింఛన్లు తొలగించడం చాలా అన్యాయమని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం మండలంలోని నార్త్‌మోపూరు గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో అనేక మందికి భూములు ఉన్నాయనే నెపంతో అధికారులు వృద్ధాప్య పింఛన్లు తీసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత పొలాలు ఎక్కడున్నాయో తెలపాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి వయోవృద్ధులు అలసిపోయారని ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదంటూ విచారం వ్యక్త పరిచారు. ఈ ప్రాంత ప్రజలు పనులు లేక కుటుంబాన్ని పోషించుకునేందుకు ఇతర ప్రాంతాలైన సంఘం వైపు వెళ్లి పనులు చేసుకుని జీవిస్తున్నారన్నారు. మజారాల్లో తిరిగే క్రమంలో మేజర్ పంచాయతీగా ఉన్న నార్త్ మోపూరు గ్రామాన్ని అల్లూరు నగర పంచాయతీలో విలీనం చేయడంతో ఉపాధి హామీ పనులు లేక వలసలు వెళుతున్నట్లు బాధితులు వివరించారన్నారు. 2018లో అప్పటి చంద్రబాబు నాయుడు హయాంలో అల్లూరు–ఇస్కపల్లి రోడ్డును ప్రారంభించి తలపెట్టగా ఇంతవరకు పనులు పూర్తి చేయలేక పోవడంతో గుంతల మయంగా మారిందన్నారు. నార్త్ మోపూరు–పల్లెపాలెం గ్రామానికి సిమెంట్ రోడ్డు వేసినా ఇరువైపులా గ్రావెల్ తోలక పోవడంతో అనేకమంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇరువైపుల గ్రావెల్ తోలించమని కాంట్రాక్టర్‌ను అడిగితే గ్రావెల్ కిలోల లెక్కలో అమ్ముతున్నారని తెలియజేశార న్నారు. ఈ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలు ఎలా బతకాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే జగన్ సర్కార్ చోద్యం చూస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెంచి రైతుల నడ్డి విరుస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరు నిరంజన్ రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, రామిశెట్టి కృష్ణ చైతన్య, అరగల రమణయ్య, విడవలూరు దశరథ రామిరెడ్డి, చంతాటి రాజశేఖర్‌బాబు, కావలి జగన్‌మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



కండక్టర్ సంతోష్ నిజాయతీ..

- బస్సులో దొరికిన పర్సు అప్పగింత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం కొత్తబజార్‌కు చెందిన ఓరుగంటి అనంత రాజ్యలక్ష్మి శుక్రవారం కావలి డిపోకు చెందిన ఒంగోలు వెళ్లే బస్సులో కావలి నుండి తెట్టు వరకు ప్రయాణం చేసి, దిగునప్పుడు తన పర్సు బస్సులో మర్చిపోయారు. ఆ విషయం శనివారం ఆమె, ఆమె భర్త రమేష్ బాబుతో కలిసి బస్టాండుకు వచ్చి తెలియపరచగా, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవి ఆర్ బాబు విచారణ జరిపారు. ఆమె పోగొట్టుకున్న పర్సును ఆ బస్సు కండక్టర్ ఈ.వి.సంతోష్‌కుమార్ డిపోలో జమ చేసి ఉన్నారు. సదరు పర్సులో సుమారు ఒకటిన్నర సవర బంగారపు గొలుసు, రూ.1061 నగదు ఉన్నాయని కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవి ఆర్ బాబు, కండక్టర్ ఈ. వి. సంతోష్ కుమార్, ఆర్‌టిసి సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రమణయ్య, ఇతర సిబ్బంది సమక్షంలో ఓరుగంటి అనంత రాజ్యలక్ష్మికి వారు పోగొట్టుకున్న ఒకటిన్నర సవర బంగారు గొలుసు రూ.1061 అప్పగించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు కండక్టర్ ఈవి సంతోష్ కుమార్‌ను అభినందించినారు.

దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, వీటి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దోమల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ప్రకటనలో పేర్కొన్నారు. దోమల నిర్మూలన చర్యలు చేపట్టక పోవడంతో దోమలు విపరీతంగా ప్రబలి పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజలను కుడుతున్నాయన్నారు. సాయంత్రం అయ్యేసరికి పట్టణంలో ప్రజలు ఎక్కడ నిలబడలేని పరిస్థితి ఉందన్నారు. దోమలు కుట్టటం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని, దోమల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు వీధుల వెంట బ్లీచింగ్, సైడ్ కాలవలలో పిచికారి, ఫాగింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ అలాంటిది అక్కడ కనపడట్లేదన్నారు. మున్సిపల్ అధికారులకు ప్రజల సమస్యలు పట్టడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

మానవతా నైతికత ఉద్యమంలో భాగంగా శనివారం కావలిలోని, ముసునూరులో, ఇంటిఇంటికి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ సందేశం ఇచ్చారు. ఇందులో జమాతే ఇస్లామి హింద్, సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై కావలి ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-అల్లూరు



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శీనానాయక్

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం కావలి ఆర్‌డిఒ శీనా నాయక్ పలు భూ సమస్యలపై విచారణ చేపట్టారు. మండలంలోని నార్త్ ఆములూరు గ్రామానికి చెందిన పెయ్యల వీరయ్య అనే వ్యక్తి ఆ గ్రామంలో 317 సర్వే నంబర్‌లో భూ వివాదానికి సంబంధించి ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేయగా ఆ సమస్యపై వెంటనే విచారణ చేపట్టారు. తదుపరి స్థానిక డిగ్రీ కళాశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ స్టేషన్లను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం నార్త్ ఆములూరు గ్రామంలోని జగనన్న లే అవుట్లలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలను పరిశీలించి ఉగాది నాటికి అంతా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ చెంచయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, మండల సర్వేయర్ అన్రూప్, విఆర్‌ఒ పుల్లారావు తదితరులున్నారు.

లోక్ అదాలత్‌లో 1261 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కావలి



స్థానిక కోర్టు భవనాల ఆవరణంలో శనివారం జరిగిన "నేషనల్ లోక్ అధాలత్"లో మొత్తం 1261 సివిల్, క్రిమినల్, బ్యాంక్ రికవరీ, బిఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కారమైనట్లు నిర్వాహకులు తెలిపారు. అందుకుగానూ రూ.91లక్షలు రికవరీ అయ్యాయని చైర్మన్ ఎం.శోభా, సీనియర్ సివిల్ జడ్జీ ఎం.శోభా, అన్నపూర్ణశ్రీ, మేజస్ట్రేట్ లోక్ అదాలత్ బెంచి నిర్వహించారు. ఎస్.ఎక్స్.కెనడీ, శ్రీదేవి, బాలాజీ న్యాయవాదులు మాచర్ల, బెంచి మెంబర్లగా వ్యవహరించారు. నేషనల్ లోక్ అదాలత్ విజయవంతం చేసినందుకు న్యాయవాదులకు, పోలీసులకు, కోర్టు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్లకు లాభం

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన 2023–2024 బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా ఉంది. ప్రజలను ఆహారం సమకూర్చేందుకు ఆరుగాలలపాటు చెమటోడ్చి పనిచేస్తున్న రైతాంగానికి ఏమాత్రం లాభం చేకూర్చే విధంగా లేదు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను పూర్తిగా దివాళా తీసే విధంగా ఉందంటూ ఆయా సంఘాల నాయకులు సైతం నగరంలో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, ఉపాధి చట్టానికి కేటాయించే నిధుల్లో కోత విధించడాన్ని నిరసిస్తూ ఆయా సంఘాలు సంయుక్తంగా సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు రైతాంగం నుంచే కాకుండా ప్రజల నుంచి సైతం విశేష స్పందన కనిపించింది. గతేడాది బడ్జెట్‌తో పోల్చుకుంటే కేంద్రం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే వ్యవసాయ రంగం, ఉపాధి హామీ పథకం తదితర రంగాలకు కేటాయించే నిధులపై భారీగా కోత విధించింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, పాదయాత్రలు చేసే సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు చేసిన సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేస్తామంటూ చేసిన హామీలు అమలు చేయాలంటూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం విజయవాడలో సంకల్ప దీక్ష చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ చర్యల్లో భాగంగా అర్ధరాత్రి సమయంలో ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలో ఉపాధ్యాయుల నివాసాలకు పోలీసులు వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ చర్యలను ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించాయి. వైసిపి ప్రభుత్వం తనను అవమానించిందని, నమ్మకం లేనిచోట తాను ఉండలేనంటూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న రూరల్ నియోజక వర్గ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అమరావతి రైతులు సంఘీభావం తెలిపారు. గతంలో న్యాయస్థానం టూ దేవస్థానం అంటూ రైతులు చేపట్టిన పాదయాత్ర సమయంలో జోరువానలో సైతం పాదయాత్రలు చేస్తున్న రైతులను కలిసి వారు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపిన శాసనసభ్యుడిపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదంటూ రైతులు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎంఎల్‌సి ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అనుసరించి అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనంగా రూ.26వేలు అందజేయాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ సెంటర్లలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలంటూ జిల్లాలోని 13 ప్రాజెక్టులకు చెందిన అంగన్ వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అదేవిధంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలు, బాలికలపై అత్యాచారయత్నాలు, మానసిక వేధింపులు వంటి ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, పాఠశాలలకు వెళ్లిన బాలికలను సైతం వేధింపులకు గురిచేయడం వంటి చర్యలను అరికట్టాలంటూ ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టాయి.

వీ క్ష ణం